# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 197 | విశాఖపట్నం | 18-4-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 197 | VISAKHAPATNAM | 18-4-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBIPay
G Pay | Paytm | Pay




# తైపురంలో ప్రభుత్వ భూమికి రెక్కలు...!

## కబ్జాకు గురవుతున్న వెదుళ్ల గెడ్డ గ్రోయిన్.. ఆందోళనలో రైతులు

**ఎకరం భూమి కొంటె రెండు ఎకరాలు ప్రభుత్వం భూమి ఫ్రీ**

**వన్ ప్లస్ టు ఆఫర్, రండి వాలి పోండి..**

**కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమినీ దోచుకుందాం**

**రాత్రికి రాత్రే లక్షలు విలువ చేసే టేకు చెట్లు మాయం..!**

**చక్రం తిప్పుతున్న ప్రముఖ దినపత్రిక విలేఖరి..!**

**మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్న అధికారులు....**

**కబ్జాకి అసలు సూత్రధారులు వైసీపీ నాయుకులే అంట?**

**టీడీపి, వైసీపీ నాయకులు కలిసి కోట్లు విలువ చేసే భూములు దోచుకున్న ఘరానా దొంగలు**

**సూత్రధారులు పాత్రధారులు ఓ మండల నాయకుడితో తోడు దొంగలు ముఠా**

**కళ్ళుండి కబోదులుగా వ్యవహరిస్తున్న రెవిన్యూ అధికారులు**

**రెవిన్యూ అధికారులు అండదండలతో రెచ్చిపోతున్న భూ మాఫియాగాళ్ళు...**









**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలోని కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది.. భూమిలుకి రెక్కలు వచ్చాయి అంటే సరిపోతుందేమో...కానీ 50 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని దోచుకున్నారంట. భూకబ్జాదారులు ప్రభుత్వ భూమి ఉంటే చాలు రాబందుల్లాగా వాలిపోతున్నారు. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేస్తున్నా సరే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ చోద్యం చూస్తూ అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారనడానికి ఉదాహరణ తాజాగా కోట్లు విలువచేసే భూమి వెలుగు చూసింది. మండలంలో తైపురం రెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 168-2 లో సుమారు (తరువాయి 2వ పేజీలో)

---

### రోడ్డు ప్రమాదంలో
## ఆరుగురు మృతి



**బెంగళూరు, పతాకం న్యూస్:** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. టైరు పేలి ఓ కారు బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు కూడా వ్యాపించాయి. మంటల్లో కాలి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన యాదగిరి జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం (తరువాయి 2వ పేజీలో)

---

### తల్లి, చెల్లిని గుర్తుచేసుకుని
## ఓటేయండి : మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మహిళా రిజర్వేషన్ చట్ట సవరణలపై కీలకమైన ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రధాని మోడీ శుక్రవారం లోక్‌సభ ఎంపీలందరికీ ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దయచేసి మీ కుటుంబాల్లోని మహిళలను గుర్తుచేసుకుంటూ.. మీ మనస్సాక్షిగా ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయండి. శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించే ఈ చట్టం, మన దేశంలోని మహిళలకు న్యాయం చేయడానికి లభించిన ఒక గొప్ప అవకాశం. దయచేసి మన నారీశక్తికి కొత్త అవకాశాలను దూరం చేయవద్దు. ఈ సవరణ ఏకగ్రీవంగా ఆమోదం పొందితే, అది మన దేశ మహిళలకు మరింత సాధికారతను కల్పించి, మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది అని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. చరిత్ర సృష్టించడానికి ఈ రోజు మనమందరం ఏకమవుదాం. దేశ జనాభాలో సగంగా ఉన్న భారతదేశ మహిళలు తమకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను పొందేలా చూద్దాం. ఇంట్లో ఉన్న మీ తల్లి, సోదరి, కుమార్తె, లేదా భార్యను దృష్టిలో ఉంచుకుని మీ మనస్సాక్షి చెప్పిన మాట విని మహిళా కోటా బిల్లుకు ఓటు వేయండి అని మోడీ ఎక్స్ పోస్టులు లోక్‌సభ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.

---

### రూ.2 లక్షల లంచం తీసుకుంటూ
## ఏసీబీకి చిక్కిన ఎక్సైజ్ సీఐ



**కామారెడ్డి, పతాకం న్యూస్:** కామారెడ్డి జిల్లాలో ఓ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న దీను సత్య నారాయణ రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా (తరువాయి 2వ పేజీలో)

---

## మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజనపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 'మెజిషియన్'గా రాహుల్ గాంధీ సంబోధించారు. దీనిపై లోక్‌సభలో బీజేపీ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం మాట్లాడాలని, బిల్లుపై దృష్టి పెట్టాలని స్పీకర్ ఓం బిర్లా సైతం రాహుల్‌కు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లును దేశ వ్యతిరేక చర్యగా రాహుల్ తప్పుపట్టారు. దళితులు, ఓబీసీలకు సమాజంలో దక్కాల్సిన స్థానాన్ని దూరం చేసేలా ఉందన్నారు. ఇది మహిళా సాధికారత కోసం తెచ్చిన బిల్లు కాదని, దేశ ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చే ప్రయత్నమని తప్పుపట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలనుకున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### కార్మికుల ఆందోళన..

రెక్కలు ముక్కలు చేసుకున్నా కనీస అవసరాలు కూడా తీరకపోవడంతో వేతనాల పెంపు కోసం ఆందోళన చేస్తున్న కార్మికులపై ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాలు విరుచుకుపడుతున్న తీరు దుర్మార్గం! నెలల తరబడి విజ్ఞప్తులు చేసినా, రాయబారాలు జరిపినా కనీస స్పందన లేకపోవడంతో కార్మికులకు ఆందోళనలకు దిగడం మినహా మరోమార్గం లేకుండా పోయింది. తొలుత రెండు మూడు యూనిట్ల వద్ద శాంతియుతంగా కార్మికుల ఆందోళన ప్రారంభమైంది. ఆ తరువాత ఒకటి, రెండు గంటల్లోనే 80కిపైగా ప్రదేశాలకు విస్తరించడం, 45 వేల మందికిపైగా భాగస్వాములు కావడం పారిశ్రామిక వాడల్లో పరిస్థితులు ఏ స్థాయికి దిగజారాయో, కార్మికులు ఎంతగా విసిగి పోయి ఉన్నారో చెప్పడానికి నిదర్శనం. శాంతియుతంగా సమస్యను పరిష్కరించాల్సిన బిజెపి ప్రభుత్వాలు దానికి భిన్నంగా వ్యవహరించి, భయభ్రాంతులను చేయడమే లక్ష్యంగా పోలీసులను ఉసిగొల్పాయి. అయినా, వెనక్కి తగ్గని కార్మికులు వేతనాల పెంపుతో పాటు, పని ప్రదేశంలో భద్రత, ముందస్తు నోటీసు లేకుండా తొలగింపు, పనిగంటల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మరింత ఉధృతంగా తమ ఆందోళనను కొనసాగించారు. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున అణచివేత చర్యలకు దిగింది. 300 మందికి పైగా కార్మికులను, నేతలను అరెస్ట్ చేసింది. కార్మిక వాడలతో పాటు, సమీపంలోని గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున దాడులకు దిగింది. కార్మికులను కొట్టడంతో పాటు, కనపడిన వారికి కనపడ్డట్టుగా ఎత్తుకుపోతున్నారంటూ వస్తున్న వార్తలు భయం కలిగిస్తున్నాయి. వారిని ఎక్కడకు తరలిస్తున్నారో కూడా చెప్పడం లేదంటూ కార్మిక కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. కార్మికులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని సైతం పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. సమస్యను పరిష్కరించడానికి బాధ్యత వహించాల్సిన కార్మికశాఖ మంత్రి విదేశీ శక్తుల మద్దతుతో ఆందోళనలు జరుగుతున్నాయనడం, కార్మికులను ఉగ్రవాదులతో పోల్చడం సిగ్గుచేటు! దేశ రాజధాని న్యూఢిల్లీకి అత్యంత సమీపంగా ఉండే నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగావ్ లలోని నేషనల్ కాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్)పారిశ్రామిక బెల్ట్ లోని వివిధ ఫ్యాక్టరీల కార్మికులు చట్టబద్ద హక్కులు, కనీస జీవన ప్రమాణాల కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లతో కనీస వేతనం అన్న భావన రద్దు అయ్యింది. దీనిని అవకాశంగా తీసుకున్న ఫ్యాక్టరీల యజమానులు పెద్ద ఎత్తున శ్రమ దోపిడి ప్రారంభించారు. ఎన్‌సిఆర్ విస్తరించి ఉన్న ఉత్తరప్రదేశ్, హర్యానాల్లోని బిజెపి ప్రభుత్వాలు యాజమాన్యాల ప్రయోజనాలకే పెద్దపీట వేయడంతో కార్మికుల పరిస్థితి దారుణంగా మారింది. రోజుకి పది గంటలపైగా పని చేసినా 300 రూపాయల వేతనం లభించడం కూడా కష్టంగా మారింది. దీంతో పాటు లేబర్ కోడ్‌ల పుణ్యమా అని కాంట్రాక్టు వ్యవస్థ కార్మికుల పని భద్రతను ప్రశ్నార్థకంగా మార్చింది. ఎప్పుడు ఉంటుందో, ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో పనికోసం, వేతనాల కోసం యాజమాన్యాల దయా దాక్షిణ్యాలపై ఆధారపడే దుస్థితి కార్మికులకు ఏర్పడింది. దీనిని అవకాశంగా తీసుకున్న యాజమాన్యాలు పని ప్రదేశాల్లో భద్రతా చర్యలను దాదాపుగా విస్మరించాయి. పెద్ద ఎత్తున అమానవీయ చర్యలకు, శ్రమ దోపిడికి దిగాయి. అయితే, ఈ పరిస్థితి ఎల్లకాలం సాగదు కదా! వేతనాలు పెంచాలని, చట్టబద్దమైన ప్రయోజనాలు అమలు చేయాలని కార్మికులు కొంత కాలంగా ఆందోళనకు దిగారు. గత రెండున్నర మాసాలుగా ఈ నిరసనలు సాగుతున్నాయి. అప్పటి నుండి ఈ ఆందోళనలను అణచివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. అప్పటి నుండి అరెస్టులు జరుగుతూనే ఉన్నాయి. ఢిల్లీలోని సిఐటియు నేతలను కొద్ది రోజులగా గృహ నిర్బంధంలో ఉంచారు. అయినా, ఎన్‌సిఆర్‌లో కార్మికుల తిరుగుబాటును ఆపలేకపోయారు. ఇప్పటికైనా పరిస్థితి తీవ్రతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి. అన్ని రకాల అణచివేత, ప్రతీకార చర్యలను తక్షణమే ఆపివేయాలి. కార్మికులతోనూ, కార్మిక సంఘాలతోనూ చర్చించి వారి డిమాండ్లను పరిష్కరించాలి.

## జగన్ యూరప్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్

### 25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి




**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

## నారీ శక్తి వందన్ బిల్లుపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయి: మంత్రి సత్యకుమార్



**విజయవాడ, పతాకం న్యూస్:** నారీ శక్తీ వందనం బిల్లుపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అత్యంత బాధ్యతారహితంగా మాట్లాడారని ఏపీ మంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారిత బిల్లుపై, మహిళల అభివృద్ధి గురించి మాట్లాడమంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అవహేళనగా మాట్లాడారని ధ్వజమెత్తారు. ఒక దేశ ప్రధానిని పట్టుకుని జాదూఘర్, ఓ మ్యాజిషన్ అని, ఓ సైనిక శక్తిని అవహేళన చేసేలా రాహుల్ గాంధీ మాట్లాడారని.. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ.. మోదీపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ రాహుల్ ఫ్రస్టేషన్ అనేది తేటతెల్లమవుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ విమర్శించారు. ఓ ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన అర్హతలు రాహుల్ గాంధీకి ఏమాత్రం లేవని ఎద్దేవా చేశారు. దేశ ప్రధాని మోదీ డెసిషన్, లీడర్ షిప్‌ని ప్రజలందరూ చూశారని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి కళ్లముందు కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయంగా భారతదేశానికి ఖ్యాతి తీసుకొచ్చేలా ప్రధాని మోదీ చర్యలు చేపట్టారని ఉద్ఘాటించారు. మన సైనిక శక్తిని, దేశ భద్రతను అవమానించే విధంగా రాహుల్ గాంధీ మాట్లాడటం అత్యంత హేయమని ఆగ్రహించారు. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పేలా ప్రధాని మోదీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని ప్రస్తావించారు. సైనికుల బలం మన దేశ భద్రత సత్తా ఏంటో తెలిసి పాకిస్థాన్ కూడా తమపై దాడులు జరిగాయని ఒప్పుకుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. అలాంటి దేశ భద్రతపై, సైనికులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఏ శక్తివంతమైన దేశానికి మన దేశం తీసిపోకుండా చేశారని చెప్పారు. నల్లధనాన్ని కట్టడి చేసినందుకు దేశ ప్రజలందరూ స్వాగతించారని అన్నారు. ప్రజల విజ్ఞతను రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారా..? అని దుయ్యబట్టారు. ఎవరి హయాంలో ఎలా పాలనా సాగిందో ప్రజలందరూ మర్చిపోలేదని చెప్పారు. 2జీ స్కాం దగ్గర నుంచి కోల్ స్కాం వరకు లక్షల కోట్లు ఏవిధంగా దోచుకున్నారో అందరికీ తెలుసునని అన్నారు. మహిళల సాధికారత కోసం తీసుకొస్తున్న బిల్లును వ్యతిరేకించటం రాహుల్ గాంధీ మనస్తత్వం ఏంటో అర్ధమవుతుందని విమర్శించారు. అవినీతి, ఆరోపణ లేకుండా అత్యంత పారదర్శకంగా మోదీ పాలన అందిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## ఏపీలో మాత్రం 'రెడ్‌బుక్' రాజ్యమేలుతోంది: విడదల రజిని



**గుంటూరు, పతాకం న్యూస్:** దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చిన ఈరోజు దేశ చరిత్రలో ఒక గొప్ప రోజని వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని కొనియాడారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ బిల్లుతో దేశ భవిష్యత్తు మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చని, ఇప్పటికే వైసీపీ ఈ బిల్లుకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. మహిళల అభివృద్ధి కోసం సామాజిక సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని, ఆయన హయాంలో అమలైన 90 శాతం పథకాలు మహిళా సాధికారత కోసమే రూపొందించబడ్డాయని ఆమె పేర్కొన్నారు. అయితే, ఇదే సమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విడదల రజని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారిపోయిందని, మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. "జగనన్న హయాంలో దిశ యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు, జీరో ఎఫ్ఐఆర్ వంటి వినూత్న కార్యక్రమాలతో మహిళలకు భద్రత కల్పిస్తే... నేడు చంద్రబాబు హయాంలో కేవలం 'రెడ్‌బుక్' పాలన మాత్రమే సాగుతోంది" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్, చంద్రబాబులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారిని వెనక్కి తెచ్చారా? అని నిలదీశారు. మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడుతున్న కూటమి ఎమ్మెల్యేలు, నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రజని ప్రశ్నించారు.

(మొదటిపేజీ తరువాయి)

## ప్రభుత్వ భూమికి రెక్కలు..!

20 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీని మూలంగా కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

### లక్షలు విలువ చేసే టేకు చెట్లు నరికివేత

సర్వేనెంబర్ 168-2 ఏళ్ల తరబడి ఉన్న వృక్ష సంపదను భూ కబ్జాదారులు రాత్రికి రాత్రే నరికించి, నరికిన చెట్లను ఆక్రమణదారులు, స్టానిక రాజకీయ నాయకుడు కలిసి ప్రభుత్వ స్థలంలో ఉన్న చెట్లను పప్పు బెల్లాలు లాగా పంచుకుంటున్న సరే అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల అటు అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఏ స్థాయిలో అమ్యామ్యాలు ముట్టాయో ఇట్టే తేటతెల్లమవుతుంది.

### వెదుళ్ళ గడ్డ గ్రోయిన్ ఆక్రమణ పై రైతుల గగ్గోలు

బుచ్చయ్యపేట మండలంలోని ఎర్రవాయి ప్రాంతం నుండి అనేక చెరువుల నుండి వచ్చే వరద నీరు నేరుగా వెదుళ్ళ గెడ్డ గ్రోయిన్ ద్వారా శారదా నది పరివాహక ప్రాంత రైతులకు జీవనాడిగా ఉపయోగపడుతున్న తరుణంలో భూ కబ్జాదారులు కన్ను పడింది. వెదుర్ల గెడ్డ గ్రోయిన్ పై పడటంతో నేడు ఆ ప్రాంత రైతులు గగ్గోలు పెడుతున్నారు. గ్రోయిన్ ఆక్రమణ వలన వర్షాకాలంలో తమ భూములు ముంపుకు గురయ్యే ప్రమాదం తోపాటు తమ భూములకు నీటి సౌకర్యం కోల్పోతున్నామంటూ స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువన ఉన్న స్వామి నాయుడు చెరువు తోపాటు వివిధ చెరువుల నుండి వచ్చే వరద నీరు వెళ్లే మార్గం పూర్తిగా ఆక్రమణకు గురవుతుందని దీనిపై సంబంధించిన ఇరిగేషన్ శాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులు ఆక్రమణదారులపై తగు చర్యలు చేపట్టకపోతే పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయి అని ఆర్టిఏ కార్యకర్త హెచ్చరిక జారీ చేశారు. జిల్లా యంత్రాంగానికి, ప్రభుత్వ పెద్దలకు నివేదికలు పంపవలసి వస్తుందని పలు రైతు సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

### ప్రభుత్వ భూమి ఆక్రమణలో చక్రం తిప్పుతున్న పత్రిక విలేకరి

త్రైపురం రెవిన్యూ సర్వేనెంబర్ 168--2 లో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు పన్నిన పన్నాగంలో మండలానికి చెందిన ఒక ప్రముఖ దినపత్రిక విలేఖరి చక్రం తిప్పినట్లు ఆ నోట ఈ నోట గుసగుసలు వినబడుతున్నాయి. సంబంధించిన ప్రభుత్వ భూమికి ఆనుకుని ఉన్న భూ యజమానిని మండలానికి చెందిన కీలక నేత గతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదు చేసి భయపెట్టి వారి నుండి తక్కువ రేటుకే భూమిని కొనుగోలు చేసి దానికి అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని (వన్ ప్లస్ టు ఆఫర్) ఒక ఎకరం జిరాయితీ భూమి కొంటె రెండు ఎకరాల ప్రభుత్వ భూమి దక్కించుకునేందుకు(ఆక్రమించుకునేందుకు) భారీ స్కెచ్ ఏర్పాటుచేసి అధికారులను మీడియా ప్రతినిధులను మేనేజ్ చేస్తూ భారీ మొత్తంలో వారికి ముడుపులను ముట్ట చెప్పి వారిని అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా ప్రభుత్వ భూమిని కాజేసేందుకు పక్కా ప్లాన్ సిద్ధం చేశారనే పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ప్రభుత్వ భూమికి రక్షణ లేదా అంటున్న ప్రజా సంఘాలు

మండలంలోని త్రైపురం రెవిన్యూ లో ఉన్న ప్రభుత్వ భూముల పై భూకబ్జాదారులు రాబందుల్లాగా వాలి ఆక్రమణలు చేస్తున్న సరే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారే తప్ప అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఈ భూములపై గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఒక సామాజిక సంస్థ కూడా అప్పటి ఎమ్మెల్యే తో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆయిన ఈ భూములకు రక్షణ కల్పిస్తారు ఏమో అని ఎదురు చూస్తే కూటమి నాయకులు అండ దండలుతో వైసీపీ నాయకులు కుమ్మక్కు అయి దోచుకున్నారు అనటానికి ఈ భూమే నిదర్శనం అని ఆర్టిఏ కార్యకర్త గోగ్గలు పెడుతున్నారు..

## రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి

ఓ ప్రైవేట్ బస్సు కలబురగి నుంచి బెంగళూరు వెళుతోంది. మరో వైపు ఓ కారు యాదగిరి నుంచి రాయచూరు వెళుతోంది. యాదగిరి దగ్గర కారు ప్రమాదానికి గురైంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. దీంతో అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు వ్యాపించాయి. కారు, బస్సు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరు మంది కాలి బూడిదయ్యారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ప్రమాద స్థలానికి వెళ్లారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. అధికారులను ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ప్రమాదంలో ఆరు మంది చనిపోయారు. ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. టైర్ పేలటం కారణంగానే ప్రమాదం జరిగింది' అని తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కారు, బస్సు మంటల్లో కాలుతున్న దృశ్యాల తాలూకా వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఏసీబీకి చిక్కిన ఎక్సైజ్ సీఐ

అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఓ వ్యక్తి తన కల్లు దుకాణాన్ని మరో గ్రామానికి మార్చుకోవడానికి అనుమతి కోరాడు. అదే సమయంలో తనపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశాడు. ఈ పని చేసిపెట్టడానికి సీఐ సత్యనారాయణ బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బిచ్కుందలోని సీఐ అద్దె ఇంట్లో బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఐ వద్ద అదనంగా లభించిన రూ.45,670 నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసి, హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

## అభివృద్ధి పేరిట భారీ రాయితీలా?

### 'గూగుల్' ప్రాజెక్టుపై సిఎంకు ఈఎఎస్ శర్మ లేఖ

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతంలో గూగుల్ సంస్థ ప్రతిపాదించిన వెయ్యి మెగావాట్ల ఎఐ డేటా సెంటర్ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఎఎస్.శర్మ పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు తెలియజేశారు. ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.22 వేల కోట్ల మేర రాయితీలు ఇచ్చినట్లు సమాచారం వెలుగులోకి రావడంతో ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోందని తెలిపారు. గూగుల్ తన అనుబంధ సంస్థ ద్వారా అదాని గ్రూపుతో కలిసి ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తోందన్నారు. భారీ లాభాలు పొందే ఈ సంస్థలకు ఇంత పెద్ద స్థాయిలో రాయితీలు ఇవ్వడం సరైందా ? అని ప్రశ్నించారు. ప్రాజెక్టు కోసం సుమారు 600 ఎకరాల భూమిని 30 సంవత్సరాల లీజుపై తక్కువ ధరకు కేటాయించారని, ఆ భూముల విలువ రూ. 2,300 కోట్లకుపైగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నియమాల ప్రకారం సరైన లీజు రెంట్ వసూలు చేస్తున్నారా? అనే అంశంపై స్పష్టత అవసరమని పేర్కొన్నారు. స్టాంప్ డ్యూటీ మినహాయింపు, జిఎస్‌టి రాయితీలు, విద్యుత్ ఛార్జీల సబ్సిడీలు వంటి అనేక ప్రోత్సాహకాలు కూడా ఇవ్వనున్నట్టు తెలుస్తోందన్నారు. డేటా సెంటర్లు రోజుకు లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించే అవకాశం ఉండటంతో ఇప్పటికే నీటి సమస్యలు ఉన్న విశాఖ ప్రాంతంపై ప్రభావం పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

# బలిమెల నీటి వినియోగంపై సమీక్ష



**సీలేరు, పతాకం న్యూస్:** ఆంధ్ర, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై ఇరు రాష్ట్రాల అధికారులు ఒడిశాలోని బలిమెలలో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-2026 నీటి సంవత్సరంలో ఏ రాష్ట్రం తమ వాటాగా ఎంతెంత నీటిని వినియోగించుకుందో లెక్కలు కట్టారు. ఈ నీటి సంవత్సరంలో మార్చి నెలలో ఆంధ్రా తన వాటాగా అత్యధికంగా 11.5958 టీఎంసీలు, ఒడిశా 6.4559 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు తేల్చారు. అలాగే 2025-2026 నీటి సంవత్సరంలో 2025 జూలై నుంచి 2026 మార్చి నెలాఖరు నాటికి ఒడిశా మొత్తంగా 70.2193 టీఎంసీల నీటిని వినియోగించుకుందని, ఆంధ్రప్రదేశ్ తన వాటాగా ఇప్పటి వరకు 49.0488 టీఎంసీలు వినియోగించుకున్నట్టు నిర్ధారించారు. దీని ప్రకారం ఇప్పటి వరకు ఒడిశా.. ఆంధ్రా కంటే 21.1705 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు తేల్చారు. ప్రస్తుతం బలిమెలలో 44.5350 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని, జోలాపుట్టులో 10.8348 టీఎంసీలు ఉన్నాయని, ఈ రెండు జలాశయాల్లో మొత్తంగా 55.3698 టీఎంసీల నిల్వలు ఉన్నాయని గుర్తించారు. ఈ నెలాఖరు నాటికి ఈ రెండు జలాశయాల పరివాహక ప్రాంతాల నుంచి మరో 1.400 టీఎంసీల నీరు వచ్చి చేరుతుందని, దీంతో మొత్తం 56.7698 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు లెక్కలు తేల్చారు. ఈ నీటి నిల్వల్లో ఏపీకి 38.9702 టీఎంసీలు, ఒడిశాకు 17.7996 టీఎంసీలగా పంపకాలు చేశారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల విద్యుత్ డిమాండ్, ఇరిగేషన్ అవసరాల నిమిత్తంగా ఏపీకి ఆరు వేల క్యూసెక్కులు, ఒడిశాకు 2,100 క్యూసెక్కుల నీటిని ఏప్రిల్ నెలాఖరు వరకు వినియోగించుకోవాలని ఇరు రాష్ట్రాల అధికారులు నిర్ణయించారు. ఈ సమావేశంలో ఒడిశా తరఫున బలిమెల ప్రాజెక్టు సీనియర్ జనరల్ మేనేజర్ దిలీప్‌కుమార్ స్వన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఓంప్రకాశ్ నాయక్, మేనేజర్ విమలా టీర్కే, డిప్యూటీ మేనేజర్లు కె.చంద్ర బెహరా, రాకేష్ పాణిగ్రహి, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్ ఐచ్, పొట్టేరు ఇరిగేషన్ ప్రాజెక్టు సీఈ తృపాకుమార్ పాత్రో, ఎస్‌ఈ కైలాస్ సేతి, బలిమెల ఎర్త్ డ్యామ్ డివిజన్ ఏఈఈలు తుషార్ రంజన్ కుంత్రై, దిలీప్‌కుమార్, దల బెహరా పాల్గొన్నారు. ఏపీ తరఫున సీలేరు కాంప్లెక్స్ జెన్‌కో అధికారులు ఎస్‌ఈ షేక్ జాకీర్ హుస్సేన్, ఈఈ టి.అప్పలనాయుడు, ఏఈఈ సీహెచ్ సురేశ్ పాల్గొన్నారు.

## చందనోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



**సింహాచలం, పతాకం న్యూస్:** వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీలు ఈఓ జల్లెపల్లి వెంకటరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. క్యూల నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఎమర్జన్సీ గేట్లు ఉండేవిధంగా క్యూలు ఏర్పాటుచేయాలని, ఆ విషయం తెలిసేలా బోర్డులు పెట్టాలన్నారు. టీటీడీ, విజయవాడ కనకదుర్గ ఆలయంలో నిర్వహణ చూసే అధికారులను కూడా డిప్యూటేషన్‌పై రప్పించాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ పక్కాగా జరిగేవిధంగా టీమ్‌లను ఏర్పాటుచేయాలన్నారు. కొండదిగువ నుంచి వచ్చే బస్సులపై పర్యవేక్షణ ఉండాలని, పికప్, డ్రాపింగ్ పాయింట్స్ వద్ద అప్రమత్తతతో మెలగాలి. వీఐపీలు వేచి ఉండే విధంగా ప్రత్యేక వసతి ఏర్పాటుచేయాలని, అంతరాలయ దర్శనం ప్రక్రియ అంతా గంటలో ముగించాలన్నారు. సాధారణ భక్తులకు, వీఐపీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాన్నారు. స్లాట్ల ప్రకారం దర్శనాలు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. క్యూలు, పెండాల్స్, విద్యుదీకరణ, ఇంజనీరింగ్ వర్క్స్ విషయంలో నాణ్యతా ప్రమాణాలను తప్పక పాటించాలన్నారు. ప్రసాదాల కౌంటర్ల వద్ద రద్దీని నియంత్రించాలన్నారు. డ్యూటీ అధికారులు నిర్ణీత సమయం కంటే ముందే తమ పాయింట్‌కు చేరుకోవాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం,సూచనలు అందజేస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మేరీ ప్రశాంతి, మణికంఠ చందోల్, లతామాధురి, ఏసీపీ పేడాడ ప్రదీప్తి, దేవస్థానం ఈఈ బండారు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాల్లో జేసీ పర్యటన



**పాచిపెంట, పతాకం న్యూస్:** మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ బూరిగ, చినకోనెల గ్రామాల్లో జేసీ శ్రీపూజ పర్యటించారు. గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 12వ తేదీన మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, బాధిత గిరిజనులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన జేసీ గురువారం బూరిగ గ్రామాన్ని సందర్శించారు. గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శుక్రవారం వీఆర్వో గ్రామానికి వెళ్లి ఎంతమందికి మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలనే దానిపై నివేదికను తహశీల్దార్‌కు అందజేయాలని ఆదేశించారు. వాటిని పరిశీలించి మరణ ధ్రువపత్రాలను మంజూరు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే ఆధార్, రేషన్ కార్డులు ఉన్నాయా?, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనం లేదని వారు చెప్పడంతో ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇతర సమస్యలు ఉంటే చెప్పాలని గిరిజనులను ఆమె అడిగిన తీరుకు వారు ఎంతో సంతోషించారు. ఇప్పటి వరకు ఏ అధికారి తమ సమస్యలను ఓపికగా విన్న సందర్భం లేదని వారు చెప్పారు. జేసీ వెంట అనంతగిరి తహశీల్దార్ వీరభద్రాచారి, డీటీ మాణిక్యం, వీఆర్వో రాంబాబు, తదితరులు ఉన్నారు.

## చందనోత్సవానికి 300 స్పెషల్ బస్సులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సింహాచలానికి 300 స్పెషల్ సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. ఇవికాకుండా 80 బస్సులను కొండదిగువ నుంచి పైకి షటిల్ సర్వీసులుగా నడపనున్నట్టు అధికారులు వెల్లడించారు. సోమవారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి మరునాటి ఉదయం వరకు ఈ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు ప్రకటించారు. ఈ ప్రత్యేక బస్సులను పెందుర్తి, పాతపోస్టాఫీస్, ఆర్‌కే బీచ్, మధురవాడ, గాజువాక, సింథియా, ఉక్కునగరం, కూర్మన్నపాలెం, మద్దిలపాలెం, తగరపువలస ప్రాంతాల నుంచి సింహాచలం కొండ దిగువ వరకూ నడపనున్నట్టు ఆర్ఎం అప్పలనాయుడు తెలిపారు. కొండ దిగువ నుంచి పైకి షటిల్ సర్వీసులు నడుపుతామని పేర్కొన్నారు. షెడ్యూల్ సర్వీసులు యథావిధిగా నడుస్తాయన్నారు.

## శరవేగంగా అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ వంతెన పనులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ వంతెన పనులు శర వేగంగా సాగుతున్నాయి. పిల్లర్లు, స్పాన్‌ల నిర్మాణం పూర్తవడంతో వాటిపై ప్రీఫ్యాబ్రికేటెడ్ సిమెంట్ కాంక్రీట్ గడ్డర్ల ఏర్పాటు పనులను మొదలుపెట్టారు. అచ్యుతాపురం జంక్షన్‌లో వాహనాల రద్దీ నానాటికీ పెరిగిపోయి, పద్మవ్యూహంలా తయారవడంతో ఇక్కడ ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి గత టీడీపీ హయాంలో నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించే సమయానికి వైసీపీ అధికారంలోకి వచ్చి, రీటెండర్ల పేరుతో మూడేళ్లపాటు కాలక్షేపం చేసింది. ఎట్టకేలకు 2022 జూన్‌లో టెండర్ ప్రక్రియను పూర్తిచేశారు. రెండేళ్లలో వంతెన నిర్మాణం పూర్తిచేయాలన్నది కండిషన్. కానీ పనులు చేపట్టడానికి సదరు సంస్థ ముందుకు రాలేదు. 2024 ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో భాగంగా ఇక్కడకు వచ్చిన నారా లోకేశ్.. కూటమి అధికారంలోకి రాగానే వంతెనతోపాటు అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే 2025 మార్చి 31న అచ్యుతాపురంలో శంకుస్థాపన చేశారు. వెంటనే రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఫ్లైఓవర్ వంతెన పొడవు 615 మీటర్లు, వెడల్పు 24 మీటర్లు. వంతెనకు 21 పైల్స్ (స్తంభాలు), 20 స్పాన్‌లు నిర్మించారు. గురువారం స్పాన్‌లపై గడ్డర్‌లు ఎక్కించే పనులు ప్రారంభించారు. ఒక్కొక్కటి 80 టన్నుల బరువుగల వీటిని సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని చోడపల్లి-కొండకర్ల జంక్షన్‌ల మధ్య ఖాళీ స్థలంలో తయారు చేశారు. అక్కడ నుంచి అచ్యుతాపురం జంక్షన్‌కు భారీ వాహనాలపై తీసుకువచ్చి క్రేన్‌ల సహాయంతో స్పాన్లపైకి ఎక్కిస్తున్నారు. ఒక్కో స్పాన్‌పై ఎనిమిది గడ్డర్లు ఎక్కిస్తారు. అచ్యుతాపురం జంక్షన్‌లో స్పాన్ వెడల్పు 40 మీటర్లు వుండడంతో ఇక్కడ 130 టన్నుల బరువున్న గడ్డర్లను ఎక్కిస్తారు. తరువాత గడ్డర్లపై రోడ్డు నిర్మాణం చేపడతారు. గడ్డర్లు ఎక్కించే పని జరుగుతుండడంతో అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వైపు వేళ్లే రోడ్డును మూసివేశారు. వాహనాలను మండల కాంప్లెక్స్, మార్టూరు రోడ్డుమీదుగా మళ్లించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**భీమిలి, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భీమునిపట్నం జోన్‌లోని వలందపేట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. అదే రహదారిలో వెళ్తున్న వాహనదారులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీ టీవీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్లే రహదారిలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది.

## ఉపాధి హమి కూలీలు చేత ఆదివారం పని చేయించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి: వెంకన్న డిమాండ్



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** ఆదివారం కూలీలు చేత ఉపాధి హమి పని చేయించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించి వెనక తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న డిమాండ్ చేసారు, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఇచ్చిన జాబ్ కార్డు ప్రకారం వారానికి ఆరు రోజులు మించి పని చేయించరాదన్నారు,అంతకు మించి ఆదివారం పని చేయించే అదికారం ప్రభుత్వానికి లేదన్నారు,కూలిలలు పనిదినాలు పెంపు డబ్బులు గిట్టుబాటు,కావటం లెదని అదనంగా పని చేస్తున్నారని తెలిపారు కూలీలు ఏడు రోజులు పని చూపించి మేటిరియల్ చార్జీలు అదనంగా. కేంద్ర ప్రభుత్వం నుండి పోందడం కోసం కూటమి ప్రభుత్వ కూలీలు శ్రమను దోచేస్తుందని అన్నారు, కూలీలు కష్టంతో పల్లెలు అబివృద్ధి అవుతున్నాయని తెలిపారు, మరోవైపు కూలీలు పనులు చేయకుండా డబ్బులు తినేస్తున్నారని నెపంతో కూలిలను చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఏడు రోజులు పని చేయటం కష్టమన్నారు,కూలిలతో పాటు ఉపాది హమి సిబ్బంది కూడా మానసికంగా తీవ్ర వత్తిళ్ళుకు గురు అవుతున్నారని తెలిపారు ఫేస్ యాప్ విధానం అమలు సమ్మర్ ఎలవెన్సు మంచి నీళ్ల తట్ట.గునపాం, టేంట్లు,మేడికల్ కిట్లువంటి మౌలిక సదు పాయాలు తోలగించడం వంటి చర్యలు కూలిలు ఉసురు పోసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని 10 వారాలు నుండి భకాయిలు చేల్లించలెదని ,వెంటనే భకాయిలు చేల్లించాలని ఫేస్ యాఫ్ విదానం రద్దు చేయాలని ఆదివారం పని విధానాన్ని తక్షణమే రద్దు చేయండి,లెదంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చెపాట్టడంతో పాటు ఈనెల 20వ తేదీన అమరావతి ఉపాధి హామీ కమిషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని వెంకన్న స్పష్టం చేశారు.

## ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు




**గాజువాక, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. సంఘ సంస్కరణలకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడిగా, స్త్రీ విద్యకు పునాది వేసిన దూరదృష్టి నాయకుడిగా వీరేశలింగం పంతులు గారిని స్మరించుకున్నారు. బాల్య వివాహాలను ఖండించి, వితంతు వివాహాలను ప్రోత్సహిస్తూ సమాజంలో మార్పుకు నాంది పలికిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి కూడా స్ఫూర్తిగా నిలుస్తోందని తెలిపారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డితో టీడీపీ మహిళా నేతల భేటీ.. రాజకీయ వర్గాల్లో ఆసక్తి!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ రాజధాని ఢిల్లీలో ఒక ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే పరిటాల సునీత సహా పలువురు మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను పరిటాల సునీత తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేయడంతో అవి వైరల్ అయ్యాయి. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలపై చర్చించేందుకు ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల కోసం వివిధ పార్టీల నేతలు ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ప్రాంగణంలో రేవంత్ రెడ్డి, టీడీపీ మహిళా ఎమ్మెల్యేల మధ్య ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ప్రస్తుతం టీడీపీ కేంద్రంలో ఎన్డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉండగా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇలా భిన్న రాజకీయ ధ్రువాలకు చెందిన నేతలు కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యేగా కొనసాగిన నేపథ్యంలో పాత పరిచయాల కారణంగానే మర్యాదపూర్వక భేటీ అని భావిస్తున్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించాలి

**అనకాపల్లి, పతాకం న్యూస్:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, వారు ఉన్నత శిఖరాలకు చేరేందుకు ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షాల ఫలితాల విడుదల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), ఏపీ మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెసిడెన్షియల్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు రావడం అభినందనీయమని అన్నారు. ఈ ఫలితాలను అధ్యయనంచేసి, ఏ సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చాయో గమనించి, ఆయా సబ్జెక్టుల బోధనను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సగటుకన్నా తక్కువ ఉత్తీర్ణత నమోదైన కళాశాలల నిర్వాహకులపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం త్వరలో సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని, అందువల్ల వారికి వెంటనే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల్లో ఆశించిన ఫలితాలు సాధించని విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా, మనోధైర్యాన్ని ఇచ్చేందుకు కౌన్సెలింగ్ సెషన్లు ఏర్పాటు చేయాలన్నారు.

## భూగర్భ జలాలు పెరిగేలా చూడండి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలోని జలధార-నీటి భద్రత కింద చేపడుతున్న పనులతో భూగర్భ నీటి మట్టం పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. సాయంత్రం కలెక్టరేట్ నుంచి జలధార-నీటి భద్రతపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. జలధార కింద 215 ప్రాధాన్య గ్రామాల్లో 1,679 చెరువుల పనులకు అంచనాలు తయారు చేయాలన్నారు. ఈ గ్రామాల్లో భూగర్భ జల మట్టాలు పెరిగేలా ప్రతిపాదనలు ఉండాలన్నారు. జిల్లాలో ఉన్న 8,010 చెరువుల పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్‌డీవో సత్తిబాబు, జలవనరుల ఈఈ ఎంవీ రమణ, డీఈ గోవిందరావు, డ్వామా పీడీ శారదాదేవి పాల్గొన్నారు. ఎంపి లాడ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఎంపీ లాడ్స్ పనుల ప్రగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీ నిధులతో మంజూరైన పనులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. విజయనగరంలో 68 పనులు, విశాఖ ఎంపీ నుంచి నాలుగు, ముగ్గురు రాజ్యసభ సభ్యులకు సంబంధించి 8 పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో సీపీవో బాలాజీ, ఏపీఈపీడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పునరావాసం కల్పించేదెప్పుడో?



**పాచిపెంట, పతాకం న్యూస్:** ఏదైనా ప్రాజెక్టును నిర్మిస్తే ముందుగానే నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. కానీ, పెద్దగెడ్డ ప్రాజెక్టు విషయంలో ఇది జరగలేదు. సంవత్సరాలు గడుస్తున్నా నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. 2006 సెప్టెంబరు 10న పెద్దగెడ్డ ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. జలాశయానికి వంద మీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను ముంపు గ్రామాలుగా అప్పట్లో అధికారులు గుర్తించారు. వీటిలో మండలంలోని కోడికాళ్లవలస, కేసలి, కొటికిపెంట గ్రామాలు ఉన్నాయి. కోడికాళ్లవలస సమీపంలోనే కేసలి, కోడికాళ్లవలస నిర్వాసిత కాలనీలు నిర్మించారు. కోడికాళ్లవలసకు సంబంధించి దాదాపు ఇళ్ల నిర్మాణాలు పూర్తవడంతో నిర్వాసితులు అందులో నివాసం ఉంటున్నారు. కేసలికి సంబంధించి కొద్దిపాటి ఇళ్ల నిర్మాణాలే చేపట్టారు. అవి కూడా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. కొటికిపెంటకు చెందిన 283 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం నిమిత్తం జలాశయం సమీపంలో సుమారు 25 ఎకరాల స్థలాన్ని అప్పట్లో ప్రభుత్వం కొనుగోలు చేసింది. సిమెంట్ రోడ్లు సైతం నిర్మించింది. ఇళ్ల నిర్మాణానికి రూ.50 వేలు చొప్పున మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి ఈ నిధులు సరిపడవని, మరికొంత పెంచాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. కాలయాపన జరిగిందే తప్ప నిధులు పెంచలేదు. దీంతో కొటికిపెంట నిర్వాసితులు ఇళ్ల నిర్మాణానికి నోచుకోలేదు. సుమారు 20 ఏళ్లు గడుస్తున్నా నేటికీ పునరావాసం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ముంపు గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. ముంపు గ్రామం కావడంతో అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలు చొప్పున మంజూరు చేయడంతో కొంతమంది నిర్వాసితులు తప్పనిసరి పరిస్థితుల్లో దరఖాస్తులు చేసుకున్నారు.

## ఏపీ ఎన్నికల సంఘం కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర ఎన్నికల సంఘం(రాజుజ) కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేఠా నియామకానికి ఆమోదం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోద ముద్ర వేశారు. మరి కొద్ది సేపట్లోనే అనిల్ చంద్ర పునేఠాను ఎస్ఈసీగా నియమిస్తూ ప్రభుత్వం జీఓను విడుదల చేయనుంది. అనిల్ చంద్ర పునేఠా గతంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం ఆయన విజిలెన్స్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గవర్నర్ ఆమోదం లభించడంతో ప్రభుత్వం కాసేపట్లో అధికారిక జీఓ జారీ చేసి.. అనిల్ చంద్ర పునేఠాకు పూర్తి బాధ్యతలు అప్పగించనుంది. పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్తుల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ నియామకం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అనిల్ చంద్ర పునేఠా ఐఏఎస్ 1984 బ్యాచ్ అధికారి. రాష్ట్రంలో వివిధ కీలక శాఖల్లో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. గతంలో కొన్ని సందర్భాల్లో ఎన్నికల సంబంధిత బాధ్యతలు కూడా నిర్వహించిన విషయం తెలిసిందే. జీఓ విడుదలైన వెంటనే అధికారికంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా అనిల్ చంద్ర పునేఠా బాధ్యతలు చేపట్టనున్నారు.

## ఫేస్ యాప్ లో ఫోటో పడదని... పరుగెత్తుకెళ్లి పడిపోయిన ఉపాధి మహిళా కూలీ



**పార్వతీపురం, పతాకం న్యూస్:** టైం అయిపోతోంది... వెంటనే ఫేస్ యాప్ లో ఫోటో పడదు అంటూ .... పరుగెత్తుకుంటూ వెళుతున్న ఉపాధి మహిళా కూలీ తలతిరిగి పడిపోయింది.. కనీసం పని చేసే ప్రాంతంలో మంచినీరు కూడా లేకపోవడం శోచనీయం..! తోటి కూలీలు ఆమెను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లిన ఘటన శుక్రవారం జరిగింది. పార్వతీపురం మండలం పార్వతీపురం మన్యం జిల్లా పెదమరికి పంచాయతీలో చిన్నమరికి గ్రామానికి చెందిన గంట సావిత్రి తన భర్త గంట పారయ్య కలిసి శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఫేస్ యాప్ పడదని ఆందోళనతో పరుగెత్తుకొని వెళుతుండగా ఉపాధి కూలీ గంట సావిత్రి కళ్ళు తిరిగి పడిపోయింది. సావిత్రి తెల్లవారుజామునే నాలుగు గంటల సమయంలో లేచి వంటలు అన్ని చేసుకొని కూలీ పనుల కోసం పరుగెత్తుకొని వెళుతుండగా, మార్గమధ్యలో జుమ్మెక్కిపోయి పడిపోయింది. ఈ సమయంలో ఉపాధి కూలీలు ఉండటం వలన ఎలాటి ఆపద లేకుండా ఉన్నదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతంలో మంచినీరు, మజ్జిగ, టెంట్లు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రాము డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇటువంటివి తలెత్తకుండా ఉండాలంటే ఫేస్ యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనికి వెళ్లాలని, వెంటనే ఫోటో పడదని పరుగెత్తుకొని వెళుతుండగా మార్గం మధ్యలో జుంబెక్కిపోయి మహిళా కూలీ పడిపోవడం బాధాకరమన్నారు.

శుక్రవారం ఉదయం ఆరు గంటలకే ఫోటో తీసుకోవాలని వెళుతున్న సమయంలో తీవ్ర ఒత్తిడికి గురై ఆమె కళ్లు తిరిగి పడిపోయిందని తెలిపారు. పనిచేసిన వారికి కనీసం అక్కడ మంచినీరు సౌకర్యం కూడా కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. గతంలాగే ఇప్పుడు కూడా ఇలాగే జరుగుతుందని, అందువలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలందరూ వడదెబ్బకు గురవుతూనే ఉన్నారని చెప్పారు. ఇప్పటికైనా ఫేస్ యాప్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి రాము డిమాండ్ చేశారు.

## పట్టణాభివృద్ధికి అహర్నశలు శ్రమిస్తా



**పార్వతీపురం, పతాకం న్యూస్:** పట్టణాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సాయంత్రం పట్టణం లోని ఆరో వార్డులోని మణికంఠ కాలనీ, కొత్తపోలమ్మ రాజీవ్ కాలనీలో రహదారులు, కాలువల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూట మి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, కార్యక్రమా లను విజయవంతంగా అమలు చేస్తోంద న్నారు. అంతే కాకుండా 30 వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తీవ్రతరం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఇంజనీరింగ్ అధికారులను ఆ సందర్భంగా ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు కోలా మధు ఉన్నారు.

## విజయనగరంలో మహిళల ర్యాలీ




**విజయనగరం, పతాకం న్యూస్:** మహిళా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టడంపై ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో కోట జంక్షన్ నుంచి మహిళలంతా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కోట జంక్షన్ వద్ద ప్రారంభమై. డీసీసీబీ బ్యాంకు, మూడులాంతర్లు మీదుగా గంటస్తంభవ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన మహిళా విభాగాల నాయకులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. రానున్న కాలంలో చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం మరింత పెరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకురాలు పాలవలస యశస్వి, టీడీపీ, బీజెపీ మహిళా విభాగం నాయకులు ఈ కార్యక్రమలో పాల్గొన్నారు.

## 24వ రోజుకు చేరిన జిజిహెచ్ ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ రిలే నిరాహార దీక్షలు



**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ .... సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద మార్చి 25న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 24వ రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ ఈ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .... జిజిహెచ్ లో గత 20 సంవత్సరాలుగా ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుత కాంట్రాక్టు సంస్థ నిరంకుశత్వం కొనసాగుతోందన్నారు. జీతాలు పెంచాలని, క్యాజువల్ సెలవులు అమలు చేయాలని అడిగితే కార్మికులను విధులకు దూరం చేయడం జరుగుతుందన్నారు. జిజిహెచ్ అధికారులు, కార్మిక శాఖ అధికారుల ఆదేశాలు కూడా కాంట్రాక్టు సంస్థ అమలు చేయడం లేదన్నారు. సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ .... శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం ఒక్కో సెక్యూరిటీ గార్డ్ నెల జీతంలో సుమారు 2300 రూపాయలు కాజేస్తున్నారని విమర్శించారు. ఆర్ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ కి నేటికీ ఫిబ్రవరి నెల జీతం జమ చేయలేదన్నారు. సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ .... గత నెల 17వ తేదీన సూపరింటెండెంట్ కి లేఖ అందించామన్నారు.

## వడదెబ్బతో విద్యార్థిని మృతి



**విజయనగరం, పతాకం న్యూస్:** వడదెబ్బకు గురై విద్యార్థిని మృతి చెందిన సంఘటన విజయనగరం జిల్లా రాజాంలో చోటు చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల వివరాల మేరకు... రాజాం పట్టణంలోని ఠానా వీధికి చెందిన షేక్ నాగూరు, నాగూరు బీబీ దంపతులకు కుమార్తె ముంతాజ్ (13) ఉన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. మధ్యాహ్నం స్కూల్ విడిచిపెట్టిన తర్వాత ఇంటికి వెళ్లే సమయంలో ఎండ తీవ్రతకు మార్గ మధ్యలో స్పృహ కోల్పోయారు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలిక మృతి చెందారు. వడదెబ్బకు గురై విద్యార్థిని మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

## ఆర్టీసీ బస్సు, కారు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు



**విజయనగరం, పతాకం న్యూస్:** పాలకొండ- రాజాం రహదారిలో బూరాడ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న కారు, ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న గరివిడి మండలం ఏనుగులవలసకు చెందిన గేదల రాంబాబు, చీపురుపల్లి మండలం అగ్రహారానికి చెందిన లక్ష్మణరావుకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలకొండ నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సు... రాజాం నుంచి పాలకొండ వెళుతున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు అతివేగంగా వస్తున్న కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ సమయంలో కారులో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు, బస్సులో 8 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన ఇద్దరిని రాజాం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ బాలకృష్ణ సందర్శించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

## మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వైసీపీ ధర్నా



**పల్నాడు, పతాకం న్యూస్:** మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ .... పల్నాడు జిల్లాలో వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన జరిగింది. రొంపిచర్ల నేషనల్ హైవేపై వందలాది మంది రైతులు, పార్టీ నాయకులు కలిసి ధర్నా నిర్వహించి రహదారి దిగ్బంధం చేపట్టారు. దీంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కాసు మహేష్ రెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ .... కూటమి ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పల్నాడు జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదైందని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రైతులకు నష్టాలే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ 2400 ఎం.ఎస్.పి ధరకు తక్షణమే కొనుగోలు చేయాలని, ప్రతి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో భగ్గుమంటున్న ఎండలు




**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌ను తీవ్రమైన ఎండలు, వడగాల్పులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే మే, జూన్ నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటవచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోని 215 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కోస్తా, రాయలసీమ ప్రాంతాలు వేడికి అట్టుడికిపోయాయి. శుక్రవారం కూడా మన్యం, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో 43-44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 55 మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. ఈ ఏడాది వేసవి తీవ్రతకు బలహీనపడిన తూర్పు గాలులే ప్రధాన కారణంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వేడిని తగ్గించే తూర్పు గాలుల ప్రభావం తగ్గింది. అదే సమయంలో, ఉత్తరాది నుంచి వీస్తున్న పొడి, వేడి గాలులు దక్షిణాది రాష్ట్రాలపైకి ప్రభావం చూపుతున్నాయని ఇస్రో నిపుణులు తెలిపారు. దీనికి తోడు, పసిఫిక్ మహాసముద్రంలో లానినా బలహీనపడటం కూడా వాతావరణం వేడెక్కడానికి దోహదం చేస్తోందని వారు అంచనా వేస్తున్నారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 'అర్బన్ హీట్ ఐలాండ్స్' ప్రభావం వల్ల వేడి తీవ్రత పెరుగుతోందని, ఇది ప్రజల ఆరోగ్యం, వ్యవసాయ దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకస్మిక వర్షాలు కురిస్తే తప్ప ఈ వేడి నుంచి ఉపశమనం లభించడం కష్టమని వారు అభిప్రాయపడుతున్నారు.

## 23న రాష్ట్ర పండుగగా భగీరథ జయంతి: సవిత



**అమరావతి, పతాకం న్యూస్:** మహర్షి భగీరథుని జయంతినిఈ నెల 23న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించనున్నట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ప్రకటించారు. భగీరథుడు సగర కులస్తుల ఆరాధ్య దైవమని ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. ఆయన చేసిన కఠోర తపస్సుతో గంగానదిని భువికి తీసుకువచ్చిన మహానుభావుడని కొనియాడారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన భగీరథుని పట్టుదల, త్యాగం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. భగీరథుని మహత్తును ప్రజలకు తెలియజేయాలన్న లక్ష్యంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి వేడుకలను కర్నూలులో ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నిక



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు.

## స్వీయగణనకు ప్రజలు సహకరించాలి

**పార్వతీపురం, పతాకం న్యూస్:** జనగణన -2027 ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తన గృహ సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. జిల్లా ప్రథమ పౌరుడిగా కలెక్టర్ స్వయంగా వివరాలు నమోదు చేయడం ద్వారా డిజిటల్ గణన ప్రాధాన్యతను చాటిచెప్పారు. అధికారులకు, ప్రజలకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, అందరిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కుటుంబ గణన ప్రక్రియలో భాగంగా, ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యుమరేషన్ విధానం గురువారం నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ విధానం ఈనెల 30 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ సొంత మొబైల్ ఫోన్ల ద్వారా తమ కుటుంబ వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే గణన సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు సమయం వృథా కాకుండా, ముందుగానే ఈ ప్రక్రియ పూర్తి చేయడం వల్ల పని సులభతరం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.హేమలత, గణాంక శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే నెల 26 నుంచి వార్డుల్లో 'సర్వీస్‌మేళా'లు

## జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం లేకుండా 'సర్వీస్ మేళా' పేరుతో జీవీఎంసీ ద్వారా అందే సేవలన్నింటినీ ఒకేచోట అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జీవీఎంసీ పరిధిలో బర్త్ సర్టిఫికెట్లు, డోర్ నంబర్‌లో సవరణలు, ఆస్తి పన్ను పేరు మార్పులు, ఇంటి పన్నుకు సంబంధించిన అభ్యంతరాలు, పారిశుధ్యపరమైన సమస్యలు, యూజీడీ కనెక్షన్లు, కొళాయి కనెక్షన్లు వంటి సేవలు పొందేందుకు ప్రజలు జీవీఎంసీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగుతున్నారన్నారు. అన్ని విభాగాల అధికారులు ఒకేచోట కూర్చుని ఆయా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా వార్డుల వారీగా మేళాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 26 నుంచి ఈ మేళాలను ప్రారంభిస్తామన్నారు. నగరంలో భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడికక్కడ పడేస్తుండడంతో పారిశుధ్య సమస్య తలెత్తుతున్నందున 15 ప్రాంతాలను డెబ్రిస్ డంపింగ్‌కు ఎంపిక చేశామన్నారు. అక్కడి నుంచి కాపులుప్పాడలోని సీ అండ్ డీ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంటుకు తరలిస్తామన్నారు. ఎంపికచేసిన ప్రాంతాల్లో కాకుండా మరెక్కడైనా భవన నిర్మాణ వ్యర్థాలను వేసినట్టయితే రూ.25 వేలు జరిమానా విధిస్తామన్నారు. దీనికోసం జోన్ వారీగా ఒక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు వార్డు సచివాలయ సిబ్బందితో బృందాలను ఏర్పాటుచేశామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు కనెక్టవిటీ కోసం జీవీఎంసీ ఆధ్వర్యంలో రెండు రోడ్ల నిర్మాణం జరుగుతోందని, వేపగుంట-పినగాడి రోడ్డును జూన్ 15 నాటికి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. వేపగుంట-జుత్తాడ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు ఎదురైనందున జూన్ 30వ తేదీ నాటికి అందుబాటులోకి తెస్తామన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్‌లో భాగంగా మురికివాడ రహిత నగరంగా విశాఖను తయారుచేసేందుకు యాక్షన్‌ప్లాన్ తయారుచేశామన్నారు. జీవీఎంసీ పరిధిలో 66 మురికివాడలు ఉండగా, అందులో మొదటగా వెలంపేట, ఇందిరానగర్ మురికివాడలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచామన్నారు. నగరంలో పారిశుధ్యం పెంచేందుకు 574 మంది అదనపు కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతోపాటు చెత్త సేకరణకు 50 ఈ-ఆటోలను సమకూర్చుకుంటామన్నారు. వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి లేకుండా రూ.25 కోట్లతో సమ్మర్ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామన్నారు. ఎక్కడైనా నీటిసమస్య ఉంటే తక్షణం సంప్రతించేందుకు వీలుగా టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు.

నగరంలో పచ్చదనం పెంచేందుకు వీలుగా జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక నర్సరీని ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. పచ్చదనం పెంపు, నిర్వహణ కోసం చీఫ్ ఇంజనీర్‌తోపాటు ఇద్దరు ఎస్‌ఈలు ఇటీవల ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌కు వెళ్లి అధ్యయనం చేశారన్నారు. అక్కడ మాదిరిగా జీవీఎంసీకి సొంతంగా నర్సరీ ఉండాల్సిన అవసరం ఉందని గుర్తించడంతో ముడసర్లోవ వద్ద నాలుగైదు ఎకరాల్లో దీనిని ఏర్పాటుచేయబోతున్నామన్నారు. ఏఈ, హార్టికల్చర్ అధికారి ఆధ్వర్యంలో జోనల్ కమిటీలను నియమిస్తామన్నారు. ప్రత్యేకంగా పీఎల్‌సీ విభాగాన్ని ఏర్పాటుచేశామని, నగరంలో 75 స్ట్రెచ్‌లలో పచ్చదనం పెంచాల్సిన అవసరం ఉందని గుర్తించామని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా పారిశుధ్య సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ వివరించారు. క్యూలైన్ల నిర్వహణ బాధ్యతను ఈసారి జీవీఎంసీకి అప్పగించడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్‌కు జీవీఎంసీ ఆస్తులను బదలాయించడం లేదని, ఉన్న ఆస్తుల ద్వారా మరింత ఆదాయం ఎలా సాధించవచ్చుననే దానిపై ఒక నివేదిక ఇచ్చేందుకు కన్సల్టెంట్‌ను మాత్రమే స్మార్ట్‌సిటీ ద్వారా నియమించుకుంటున్నామన్నారు. కన్సల్టెంట్‌కు ఏడాదికి రూ.50 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, ఆ మొత్తాన్ని కూడా స్మార్ట్‌సిటీ నుంచి చెల్లిస్తారు కాబట్టి, జీవీఎంసీపై భారం ఉండదన్నారు. ఆస్తుల నిర్వహణ, హక్కులు జీవీఎంసీకే ఉంటాయని స్పష్టంచేశారు. జీవీఎంసీ పరిధిలో వార్డుల విభజన ప్రారంభించామన్నారు. భీమిలి వైపు నుంచి మొదలై పెందుర్తిలో ముగించనున్నట్టు కమిషనర్ చెప్పారు. ఈనెల 24వ తేదీ నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధమవుతుందన్నారు. వార్డుల వారీగా ప్రదర్శిస్తామన్నారు. వాటిపై ప్రజలు తమ అభ్యంతరాలను తెలియజేయడానికి వారం రోజుజు అవకాశం ఉందన్నారు. భీమిలి, పెందుర్తి మండలాల్లోని మిగిలిన పంచాయతీలతోపాటు ఆనందపురం, పద్మనాభం మండలాల విలీన ప్రతిపాదనను పరిశీలించాలని ప్రభుత్వం నుంచి తమకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. దీనిపై పరిశీలన ఇప్పటికే పూర్తిచేశామన్నారు. ఆయా పంచాయతీల విలీనానికి జిల్లా పంచాయతీ అధికారి ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుందని, జిల్లా కలెక్టర్ ద్వారా ఎన్‌ఓసీ తమకు చేరితే ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు.

# ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు పెంచేందుకు డోర్ టు డోర్ ప్రచారం చేపట్టాలి: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)లకు అప్పగించి త్వరితగతిన పూర్తిచేయాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3 స్టార్ మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు ఇంటింటి ప్రచారం(డోర్ టు డోర్ క్యాంపెయిన్) చేపట్టాలని దిశానిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యా సంస్థల్లో మరింత పారదర్శకత కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుచేయనున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విషయంలో పకడ్బందీ చర్యలుండాలని స్పష్టం చేశారు. పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ విడివిడిగా సమీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1000 మందికి పైబడి విద్యార్థులున్న 60 పాఠశాలల్లో 5 స్టార్ సదుపాయాల కల్పనపై దృష్టిసారించాలని ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు ప్రాథమికోన్నత పాఠశాలలో సీట్ల కోసం పోటీ ఉండటం మంచి పరిణామంగా అభివర్ణించారు. లీక్ ప్రూఫ్ బిల్డింగ్స్, తాగునీరు, టాయ్ లెట్లు, పెయింట్స్, బల్లల ఏర్పాటు వంటి పనులను ఎస్‌ఎంసీలకు అప్పగించాలని సూచించారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.143.27 కోట్లు అవసరమన్న మంత్రి ఆ పనులను మాత్రం రాష్ట్ర పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా చేపట్టాలని దిశానిర్ధేశం చేశారు. ఈ ఏడాది మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాలకు రూ.571.11 కోట్లు అవసరమవుతాయని అధికారులు నివేదించారు. వివిధ విభాగాల ద్వారా నిధులను సేకరించి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఏజన్సీ, మారుమూల ప్రాంతాల్లో సొంత భవనాలు లేని పాఠశాలలను గుర్తించి వెంటనే పనులు చేపట్టాల్సిందిగా లోకేశ్? ఆదేశించారు. ఈసారి 10 శాతం అడ్మిషన్ల పెంపుదల లక్ష్యాన్ని మంత్రి లోకేశ్ అధికారులకు నిర్ధేశించారు. పాఠశాలల్లో డ్రాపవుట్స్‌ను జీరో స్థాయికి చేర్చాలని స్పష్టం చేశారు. బడిఈడు గల పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో స్కూలు బయట ఉండకూడదని తేల్చి చెప్పారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంపుదలకు కృషి చేయాలని ఆదేశించారు. స్కూళ్లలో జెండర్ సెన్సిటివిటీకి సంబంధించి మహిళలను కించపర్చే పదాలు ఎక్కడా ఉపయోగించకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సంబంధించి శాప్ అధికారులతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలని లోకేశ్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులను గుర్తించి బ్యాడ్మింటన్, ఆర్చరీ, ఖోఖో వంటి ఆటల్లో ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. కళాశాల స్థాయిలో లీగ్స్ నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుమతులకు సంబంధించి మార్గదర్శకాలపై సమీక్షించారు. ఇంటర్మీడియట్?లో పలువురు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా ఉత్తమ మార్కులు సాధించడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి విస్తృత ప్రచారం నిర్వహించాల్సిందిగా? ఆదేశించారు. అటువంటి వారిని షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో సత్కరించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అన్ ఎయిడెడ్ డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యా సంస్థల వివరాలతో పాటు సిబ్బంది, విద్యార్థుల ముఖ ఆధారిత గుర్తింపు కోసం ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై మంత్రి లోకేశ్? ఆరా తీశారు. నాణ్యమైన విద్యా బోధనకు ముఖ ఆధారిత హాజరు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

## ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మెట్రో రైలు స్టేషన్‌లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తి ఎవరో ఆరా తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



## బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల నిరసన




**విజయవాడ, పతాకం న్యూస్:** ప్రభుత్వ పెన్షనర్ల సామాజిక భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని బిఎస్ఎన్ఎల్ కార్యాలయాల ఎదుట పెన్షనర్లు నిరసన తెలిపారు. విజయవాడలోని మాచవరం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. 8వ పే కమిషన్ టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్సెస్‌లో పెన్షనర్ల పెన్షన్ సవరణకు సంబంధించిన విషయాలు చెప్పలేదని బిఎస్ఎన్ఎల్ ఎంటిఎన్ఎల్ కేంద్ర పెన్షనర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దేశవ్యాప్తంగా కోటి మంది పెన్షనర్లకు ముప్పు పొంచి ఉందన్నారు. ఎనిమిదో వేతన సవరణ కమిషన్ నియమ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సవరించాలని, సిపిఎస్ యుపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, కముటేషన్ ఆఫ్ పెన్షన్ రికవరీ కాలాన్ని పదకొండేళ్లకు పరిమితం చేయాలని, 2017 జనవరి 1 నుంచి బిఎస్ఎన్ఎల్ ఎంటిఎన్ఎల్ పెన్షనర్లకు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఆఫ్ బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ విజయవాడ సర్కిల్ ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్, ఉపాధ్యక్షులు పి.అశోక్‌బాబు, సర్కిల్ కన్వీనర్ ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు. కడపలో టెలికం జిఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐబిడిపిఎ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. తాము బిఎస్ఎన్ఎల్‌లో పనిచేసినప్పుడు పెన్షన్ కాంట్రిబ్యూషన్ డిఒటికి చెల్లించామని పేర్కొన్నారు. వెంటనే తమకు డిఎ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎఐబిడిపిఎ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎస్ఎన్ఇపిఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండన్న, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు. అనంతపురంలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

## ఆక్వా రంగ అభివృద్ధికి విరివిగా రుణాలు ఇవ్వాలి

**ఒంగోలు, పతాకం న్యూస్:** జిల్లాలో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రైతులకు విరివిగా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం ఆక్వా కల్చర్ రంగానికి సంబంధించి ముఖ్య భాగస్వామ్యులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా అందుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. చిన్న, అతి చిన్న ఆక్వా రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు రుణాల మంజూరు, పంట భీమా ఆధారంగా రుణాలు, రైతుల ఉత్పత్తిని కొనుగోలు చేయడం వంటి అంశాలపై చర్చించారు.

## 90 శాతం సబ్సిడీపై విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి: రైతు సంఘం డిమాండ్



**అమరావతి, పతాకం న్యూస్:** రాయలసీమ జిల్లాల రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణి చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఎకరాకు మూడు బస్తాలు చొప్పున 5 ఎకరాలకు విత్తనాలు పంపిణీ చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్ రెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు. రాయలసీమ జిల్లాలలో జిల్లాలో ప్రతి ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం విత్తనం కొరకు వేరుశనగ విత్తనాలు సరఫరా చేస్తున్నదన్నారు. గత 3 సంవత్సరాలుగా పంట చేతికి వచ్చే సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పెట్టుబడి రాకపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకు పోయారని పేర్కొన్నారు. విత్తన వేరుశనగను రైతుల నుండి రైతులే నేరుగా కొనుగోలు చేసుకునే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలే పంటకు మూలమవుతుందన్నారు. ఖరీఫ్‌కు రైతులు సిద్ధమవుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం వేరుశనగ సేకరణకు, పంపిణికి చర్యలు తీసుకోక పోవడంతో రైతులలో ఆందోళన నెలకొన్నదన్నారు. గత ఖరీఫ్, రబీలో విత్తన ఏజెన్సీలకు బకాయిపడ్డ సబ్సిడి డబ్బులు వెంటనే చెల్లించి, విత్తన సరఫరా సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకొవాలన్నారు.

## తెలంగాణ ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు మద్దతుగా నిరసన

**విజయవాడ, పతాకం న్యూస్:** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ సంస్థలో తొమ్మిది రోజుల నుంచి ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు సంఘీభావంగా విజయవాడలో విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) పిలుపు మేరకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు), యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (యుఇసిడబ్ల్యుయు) రీజనల్ కమిటీల ఆధ్వర్యంలో విజయవాడలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షులు ఎన్.సి.హెచ్.శ్రీనివాస్, యుఇఇయు రీజనల్ అధ్యక్షులు ఎల్.రాజు, యుఇసిడబ్ల్యుయు రీజనల్ కార్యదర్శి పి.అనిల్ కుమార్ మాట్లాడుతూ... ఆర్టిజన్ కన్వర్షన్స్ జెఎసి నాయకులతో చర్చలు జరిపి ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం, తొలగింపు ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదన్నారు.

## ఎలుగుబంటి దాడిలో గొర్రెల కాపరికి తీవ్రగాయాలు



**అనంతపురం, పతాకం న్యూస్:** : మండలంలోని రొద్దం చిన్న చెరువు కట్ట కింద గొర్రెల కాపరి పై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచిన ఘటన శుక్రవారం జరిగింది. ఇందులో భాగంగా .... మండలం లోని పెద్దకొడిపల్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులు అనే గొర్రెల కాపరి రొద్దం చిన్న చెరువు కట్ట కింద పొలాల్లో కి తన గొర్రెలను మేత కోసం తీసుకెళ్లారు. అయితే మొక్కజొన్న తోటలో ఉన్న ఎలుగు బంటి అతని పై ఆకస్మిక దాడి చేసి కుడి భుజం పై తీవ్రంగా గాయపరిచింది. దీంతో కాపరి గట్టిగా అరవడంతో చుట్టుపక్కలవారు వెంటనే వెళ్లి పరిశీలించి అతనిని రొద్దం ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి పెనుకొండకి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకొన్న పెనుకొండా ఫారెస్ట్ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలన చేస్తున్నారు. దర్యాప్తు చేపట్టారు.

## పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు వాషింగ్ మిషన్ల పంపిణీ



**ఎన్టీఆర్ జిల్లా, పతాకం న్యూస్:** భారతదేశంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక, సామాజిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు వాషింగ్ మిషన్లను పరపతి సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తికొండ రాంబాబు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా 18 మంది లబ్ధిదారులకు వాషింగ్ మిషన్ల పంపిణీ చేశామన్నారు. అంతరించిపోతున్న చేతి వృత్తులను తిరిగి లాభదాయకంగా మార్చాలనే లక్ష్యంతో దేశ ప్రధాని నరేంద్ర మోడి దాదాపు 18 రకాల చేతి వృత్తుల వారికి అతి తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు షేక్ రహీం, జడ్పీహెచ్ హైస్కూల్ చైర్మన్ మార్కపూడి జాన్ కోటయ్య, పోస్ట్ మాన్ అధికారులు అనిల్ కుమార్, శరణ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హైబీపీ కంట్రోల్‌లో లేకపోతే సమస్యలే..!

హైబీపీ చడీచప్పుడు లేకుండా శరీరాన్ని దెబ్బతీస్తుంది. ఇది నియంత్రణలో లేకపోతే గుండెపోటు, కిడ్నీ జబ్బులు, పక్షవాతం, మతి మరుపు వంటి సమస్యలెన్నో చుట్టు ముడతాయి. అందుకే దీన్ని తేలికగా తీసుకోకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉప్పు తగ్గించటం, వ్యాయామం చేయటం, బరువు అదుపులో ఉంచుకోవటం, మానసిక ఒత్తిడిని తగ్గించు కోవటం వంటి జాగ్రత్తలు తప్పనిసరంటున్నారు. వీలైనంత త్వరగా మందులు ప్రారంభించడం మంచిదని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కొత్త మార్గ దర్శకాలు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో లేటెస్ట్ సైంటిఫిక్ రుజువుల ఆధారంగా రూపొందించిన ఈ మార్గర్శకాల్లోని కీలకాంశాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!



ప్రస్తుతం రక్తనాళాల్లో పూడికలు, డయాబెటిస్, కిడ్నీజబ్బులు, పక్షవాత లక్షణాలు, ఒబెసిటీ వంటి ముప్పు కారకాలుండి, వచ్చే పదేళ్లలో గుండెజబ్బు వచ్చే అవకాశం 10 శాతం కన్నా ఎక్కువగా ఉన్నవారికి బీపీ 130/80 కన్నా మించితే డాక్టర్లు మందులు ఇస్తున్నారని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేశ్ గూడ పాటి చెబుతున్నారు. మిగతా వారికి రక్తపోటు అదేపనిగా 140/90 కన్నా ఎక్కువుంటే మందులిస్తున్నారట. 130/80 నుంచి 140/90 మధ్యలో ఉన్నవారికి జీవనశైలి, ఆహార మార్పులే సూచిస్తున్నారని చెబుతున్నారు. అయితే, వీరి విషయంలో మరింత శ్రద్ధ అవసరమని, జీవనశైలి మార్పులతో 3-6 నెలల్లో ఎలాంటి ఫలితమూ కనిపించకపోతే మందులు మొదలు పెట్టాలని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కొత్త మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. వచ్చే పదేళ్లలో గుండెజబ్బు ముప్పు అంచనా 7.5%, అంతకన్నా ఎక్కువున్నా, మధుమేహం వంటి గుండెజబ్బు ముప్పు కారకాలున్నా దీన్ని కచ్చితంగా పాటించాలని సూచిస్తున్నాయి. ఇప్పటివరకూ 140/90 దాటినవారికి ఒక మందుతో మొదలు పెట్టి, బీపీ తగ్గకపోతే మోతాదు పెంచుతున్నారు. అప్పటికీ ఫలితం కనిపించకపోతే రెండో మందు జత చేస్తున్నారు. అయితే.. తాజా మార్గదర్శకాలు వీరికి మొదటి నుంచే రెండు రకాల మందులను ఆరంభించాలని కొత్త మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. వీటిని విడివిడిగానైనా, కాంబినేషన్ మాత్రగానైనా ఇవ్వచ్చని, దీంతో త్వరగా బీపీ అదుపులోకి వస్తుందని తాజా ప్రయోగ పరీక్షలు చెబుతున్నాయి.గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు ఉంటే తల్లి ఆరోగ్యంపై శాశ్వత ప్రభావాలను చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే, గర్భిణుల విషయంలో బీపీ 140/80, అంతకన్నా ఎక్కువగా ఉంటే చికిత్స ప్రారంభించటమే మంచిదంటున్నారు. వీరిలో బీపీని కచ్చితంగా అదుపులో ఉండేలా చూసుకుంటే ప్రిఎక్లాంప్సి యా (గుర్రపువాతం), గర్భవాతం, పక్షవాతం, కిడ్నీజబ్బులు, నెలల నిండకముందే కాన్పు కావటం వంటి తీవ్ర దుష్ప్రభావాలు తగ్గుముఖం పడుతున్నట్టు కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. అంతేకాకుండా, కాన్పు తర్వాతా హైబీపీ కొనసాగే అవకాశం ఉండటం వల్ల వైద్యుల పర్యవేక్షణ, సరైన సమయంలో చికిత్స చేయటమూ ముఖ్యమేనంటున్నారు. వీరు కనీసం ఏడాదికి ఒకసారైనా బీపీ టెస్ట్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో గర్భిణులు తప్ప మిగతవారికీ బీపీ 180/120 ఉన్నట్టయితే చాలా తీవ్రమైన సమస్యగా పరిగణించాలని, ఇలాంటి వారికి మరింత కచ్చితమైన చికిత్స చేయాలని చెబుతున్నారు. హాస్పిటల్‌లో బీపీ టెస్ట్ చేయించుకుంటే కొన్నిసార్లు రీడింగ్ ఎక్కువగా రావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆసుపత్రి లోని వాతావరణం, వేచి ఉండటం, డాక్టర్‌ను చూడగానే ఆందోళనకు గురికావడం వంటివి దీనికి కారణమవుతాయంటున్నారు. అందువల్ల ఇంట్లో బాగా విశ్రాంతిగా ఉన్నప్పుడు టెస్ట్ చేసుకుంటే బీపీ రీడింగ్ కచ్చితంగా తెలుస్తుందని చెబుతున్నారు. కాకపోతే, నాణ్యమైన బీపీ కొలత పరికరాలు వాడటం, సరైన పద్ధతిలో పరీక్షించుకోవటం ముఖ్యమని సూచిస్తున్నారు. డాక్టర్లు, నర్సుల వద్ద నేర్చుకొని బీపీని టెస్ట్ చేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుందని వివరిస్తున్నారు. ప్రస్తుతం బీపీని కొలవడానికి స్మార్ట్‌వాచ్ వంటి ఎన్నో పరికరాలున్నాయి. అయితే, ఇవి అంతగా కచ్చితమైనవి, విశ్వసనీయమైనవి కావని నిపుణులు అంటున్నారు. కాబట్టి, పట్టీతో కూడిన నాణ్యమైన పరికరాల తోనే రక్తపోటు కొలుచుకోవాలని సూచిస్తున్నారు. హైబీపీ గలవారు రోజుకు 2.3 గ్రాముల వరకూ ఉప్పు తీసుకోవచ్చని ఇప్పటివరకూ అనుకునేవారు. దీన్ని 1.5 గ్రాములకే పరిమితం చేయటం మేలని కొత్త మార్గదర్శకాలు నిర్దేశి స్తున్నాయి. ఉప్పు మరీ తక్కువైతే ఎలా? అను కునేవారు, కిడ్నీజబ్బులేవీ లేకపోతే పొటాషియం ఆధారిత సైంధవ లవణం వంటి ప్రత్యామ్నాయ ఉప్పు ఉపయోగించు కోవచ్చని నిపుణులు చెబుతున్నారు. హైబీపీ గలవారంతా మూత్రంలో అల్బుమిన్, క్రియాటినైన్ నిష్పత్తి పరీక్ష చేయిం చుకోవాలంటున్నారు నిపుణులు. కిడ్నీ ఆరోగ్యాన్ని తెలుసుకోవటానికిది తోడ్పడుతుందని చెబుతు న్నారు. అలాగే, స్లీప్ అప్నియా గలవారితో పాటు చాలామందికి రక్తంలో ఆల్డోస్టిరాన్‌ను ఉత్పత్తి చేయటం (ఆల్డోస్టెరోనిజమ్) రక్తపోటు పెరగటానికి, పొటాషియం మోతాదులు తగ్గటానికి దారితీస్తుందని తెలియజేస్తున్నారు.

# ఐటీడీఏకు పూర్వ వైభవం వచ్చేనా?

## రాష్ట్రంలో పెద్ద ఐటీడీఏగా గుర్తింపు ఉన్నా ఆశించిన స్థాయిలో నిధులు, ప్రాధాన్యం లేని వైనం



**పాడేరు, పతాకం న్యూస్:** రాష్ట్రంలోనే పెద్ద ఐటీడీఏగా గుర్తింపు ఉన్నా ఆ స్థాయిలో ప్రాధాన్యం, ప్రభుత్వ సహకారం అందని పరిస్థితి ఎన్నో ఏళ్లుగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐటీడీఏలు నిర్వీర్యమయ్యాయనే చెప్పాలి. కూటమి ప్రభుత్వంలో కూడా పెద్దగా మార్పు కనిపించడం లేదన్న విమర్శలున్నాయి. తాజాగా ఐటీడీఏ పీవోగా ఆదిత్యవర్మ నియమితులు కావడంతో పరిస్థితులు మారతాయేమోననే ఆశాభావాన్ని మన్యంవాసులు వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏకు నిధుల కేటాయింపు, అధికారుల పోస్టుల భర్తీ, తదితర విషయాల్లో కనీస ప్రాధాన్యం కనిపించడం లేదు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకమారు ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నా ఏడాదిగా పాలకవర్గ సమావేశం ఊసేలేని పరిస్థితి నెలకొంది. గతేడాది ఏప్రిల్‌లో ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆ తరువాత నుంచి మిన్నకున్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నప్పటికీ పెద్దగా మార్పు లేదనే విమర్శలున్నాయి.

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఐటీడీఏ కార్యాలయాల్లో ప్రాజెక్టు అధికారిది కీలక పాత్ర. అటువంటి ముఖ్యమైన పీవో పోస్టు పాడేరులో తొమ్మిది నెలలు ఖాళీగా ఉంది. ఇక్కడ పీవోగా పని చేసిన వి.అభిషేక్‌ను అనివార్య కారణాలతో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా 2025 జనవరిలో బదిలీ చేశారు. ఆ తరువాత ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. దీంతో స్థానిక జాయింట్ కలెక్టర్‌గా ఉన్న అభిషేక్‌గౌడ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. అలాగే 2025 సెప్టెంబరులో ఐటీడీఏ పీవోగా టి.శ్రీపూజను నియమించే వరకు అంటే దాదాపు తొమ్మిది నెలలు అభిషేక్ గౌడ ఇన్‌చార్జి పీవోగా కొనసాగారు. శ్రీపూజ గత ఆరు నెలలుగా ఐటీడీఏ పీవోగా కొనసాగుతుండగా, ఆమెను జేసీగా నియమిస్తూ, ఆమె భర్త అస్సాం కేడర్‌కు చెందిన 2022 ఐఏఎస్ బ్యాచ్ అధికారి ఆదిత్యవర్మను తాజాగా ఐటీడీఏ పీవోగా నియమించారు. గతంలో తొమ్మిది నెలలు పీవో పోస్టు ఖాళీగా ఉండడం, తరువాత ఆరు నెలలు పీవోగా పని చేసిన శ్రీపూజ సైతం పెద్దగా దృష్టి పెట్టని పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో నియమితులైన ఆదిత్యవర్మ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేకంగా ఏమైనా కృషి చేస్తారా?, లేదా ఏదో కాలక్షేపంగా పని చేస్తారా? అనేది చూడాల్సి ఉంది. వాస్తవానికి రాజ్యాంగం ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఏర్పాటు చేసే ఐటీడీఏలకు, వాటికి పెద్ద దిక్కుగా ఉండే ప్రాజెక్టు అధికారికి ప్రత్యేకాధికారులుంటాయి. అలాగే ఐటీడీఏ పీవోలు నేరుగా గవర్నర్, రాష్ట్రపతులను సైతం కలిసే అవకాశాలున్నాయి. గిరిజన ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ శాఖలపై ఆధిపత్యం కలిగిన ప్రత్యేమైనది పీవో పోస్టు. ఈ నేపథ్యంలో దానిని సక్రమంగా వినియోగించి, ఉత్సాహంగా పని చేస్తే గిరిజనులకు మేలు జరగడంతో పాటు ఒక ఐఏఎస్ అధికారిగా పీవోకు సైతం మంచి గుర్తింపు లభిస్తుందని పలువురు అంటున్నారు. ఆ దిశగా కొత్త పీవో ఆదిత్యవర్మ ముందుకు వెళ్లాలని మన్యం వాసులు కోరుతున్నారు.

## ఇరాన్‌కు మరోసారి అమెరికా సీరియస్ వార్నింగ్...

## ఒప్పందం కుదరకపోతే ఇంధన వనరులే టార్గెట్!



**న్యూయార్క్:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌పై కఠినమైన నావికాదళ దిగ్బంధనాన్ని అమలు చేస్తున్నామని, తెలివిగా నిర్ణయం తీసుకోవాలని అమెరికా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అవసరమైతే సైనిక చర్యను మరింత తీవ్రతరం చేయడానికి తమ బలగాలు 'లాక్ అండ్ లోడ్'తో సిద్ధంగా ఉన్నాయని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. పెంటగాన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, ఎయిర్ ఫోర్స్ జనరల్ డాన్ కెయిన్, యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) కమాండర్ అడ్మిరల్ బ్రాడ్లీ కూపర్ కూడా పాల్గొన్నారు.

'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా పిలుస్తున్న సైనిక చర్య తర్వాత ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే అమెరికా ఈ హెచ్చరికలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతంపై దిగ్బంధనం ఇప్పటికే అమల్లో ఉందని, దీన్ని నిరవధికంగా కొనసాగించగలమని హెగ్సెత్ తెలిపారు. "మీ ఇంధనం కదలడం లేదు, ఇకపై కదలదు కూడా. ఇది మర్యాదపూర్వకంగా జరిగే విధానం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఏ దేశానికి చెందిన నౌక అయినా ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించకుండా ఈ దిగ్బంధనం వర్తిస్తుందని, ఇప్పటికే 13 నౌకలను వెనక్కి పంపినట్లు అధికారులు వెల్లడించారు.దౌత్యపరమైన పరిష్కారాన్నే తాము కోరుకుంటున్నామని, కానీ చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెగ్సెత్ హెచ్చరించారు. "మేం మంచి మార్గాన్నే ఇష్టపడతాం... కానీ మీరు చెడు మార్గాన్ని ఎంచుకుంటే, మీ ఇంధన పరిశ్రమతో పాటు కీలకమైన మౌలిక సదుపాయాలే మా లక్ష్యం. మా అధ్యక్షుడి ఆదేశాలతో, ఒక్క బటన్ నొక్కితే చాలు.. మేము దాడికి సిద్ధం" అని ఆయన స్పష్టం చేశారు. కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, తమ సైన్యం పూర్తి సంసిద్ధతతో ఉందని, క్షణాల్లో భారీ సైనిక చర్యలను పునఃప్రారంభించగలమని జనరల్ కెయిన్ అన్నారు. ఈ విరామ సమయాన్ని ఆయుధాలు సమకూర్చుకోవడానికి, వ్యూహాలను సర్దుబాటు చేసుకోవడానికి వినియోగించుకుంటున్నామని అడ్మిరల్ కూపర్ తెలిపారు.




## బుమ్రాకు అందుకే వికెట్లు రావడం లేదు: ఇర్ఫాన్ పఠాన్



ఐపీఎల్ 2026లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఇంకా వికెట్ల ఖాతా తెరవలేదు. కట్టుదిట్టంగా బంతులేసే బుమ్రా.. ఇప్పుడు భారీగా పరుగులు ఇచ్చేస్తున్నాడు. ఐదు మ్యాచ్‌లు ఆడి.. ఇప్పటి వరకు ఒక్క వికెట్ కూడా తీయకపోవడం అభిమానులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. జట్టు కష్టాల్లో ఉంటే ఆదుకునే అతడు.. ఇప్పుడు ఇలా అవ్వడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. బుమ్రాకు ఏమైందంటూ అభిమానులు సోషల్ మీడియాలో తెగ చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుమ్రాకు టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ ఓ కీలక సూచన చేశాడు. 'బుమ్రా బౌలింగ్‌కు వస్తున్నాడంటే వికెట్ పడుతుందనే అనుకుంటారు. అయితే ప్రస్తుతం అదే జరగడం లేదు. అతడి ఫామ్‌తో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ బుమ్రా స్పీడ్ సగటు 130కిమీ మాత్రమే ఉంది. ఇక స్లో బంతులను కూడా ఇటీవల ఎక్కువగా సంధించాడు. దాదాపు 44శాతం ఇలాంటి బాల్స్ విసిరాడు. అంటే ప్రతి రెండు బంతుల్లో ఒకటి స్లో బాల్. అలా ఎందుకు వేస్తున్నాడు? అనే విషయాన్ని అతడు విశ్లేషించుకోవాలి. ఒకవేళ ఎక్కువ స్పీడ్‌తో బౌలింగ్ చేసి.. స్లో బంతులను తగ్గిస్తే వికెట్లు వస్తాయని అనుకుంటున్నా. ఇది చాలా సింపుల్ పరిష్కారం. బుమ్రాకు ప్రత్యేకంగా కోచింగ్ అవసరం లేదు. అయితే బౌలింగ్ తీరును మార్చుకోవాల్సిన అవసరం ఉంది. వేగంగా బౌలింగ్ చేస్తూ.. అప్పుడప్పుడు స్లో బంతులను విసిరితే ప్రత్యర్థి బ్యాటర్లు ఇబ్బందిపడే అవకాశం ఉంటుంది' అని ఇర్ఫాన్ పఠాన్ తెలిపాడు. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ బుమ్రా 4 ఓవర్లు వేసి 41 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు.

## వరుస విజయాలతో

# దూసుకుపోతున్న పంజాబ్ కింగ్స్



తాజా ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ ఓటమనేదే లేకుండా దూసుకెళ్తోంది. బ్యాటింగ్.. బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా విరుచుకుపడుతుండడంతో ప్రత్యర్థి జట్లు బెంబేలెత్తుతున్నాయి. ఇదే తరహాలో ముంబై ఇండియన్స్‌ను వారి సొంత మైదానంలోనే 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. పేసర్ అర్ష్‌దీప్ (3/22) పదునైన బౌలింగ్‌కు.. ప్రభ్‌సిమ్రన్ (39 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 80 నాటౌట్), కెప్టెన్ శ్రేయాస్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 66) హాఫ్ సెంచరీలు తోడయ్యాయి. ప్రస్తుతం పంజాబ్ 9 పాయింట్లతో టాప్‌లో ఉండగా.. అటు ముంబైకి ఐదు మ్యాచ్‌ల్లో ఇది వరుసగా నాలుగో ఓటమి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 195 పరుగులు చేసింది. సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఓపెనర్ డికాక్ (60 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 112 నాటౌట్) అజేయ శతకం సాధించగా, నమన్ ధిర్ (31 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 50) మాత్రమే సహకరించాడు. ఆ తర్వాత ఛేదనలో పంజాబ్ 16.3 ఓవర్లలో 3 వికెట్లకు 198 పరుగులు చేసింది. ఘజన్‌ఫర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అర్ష్‌దీప్ సింగ్ నిలిచాడు.

ఓ మాదిరి ఛేదన పంజాబ్ బ్యాటర్ల ఆధిపత్యం ముందు సునాయాసంగా సాగింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ తుదికంటా నిలవగా.. అతడికి కెప్టెన్ శ్రేయాస్ భారీ భాగస్వామ్యంతో అండగా ఉన్నాడు. ఈ జోడీ ధాటికి ముంబై బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. తొలి ఓవర్‌లోనే ప్రభ్ 4,4 ప్రియాన్ష్ 6,4తో ఏకంగా 21 పరుగులు సమకూరాయి. అయితే స్పిన్నర్ ఘజన్‌ఫర్ తన వరుస ఓవర్లలో ఓపెనర్ ప్రియాన్ష్ (15), కూపర్ (17)లను అవుట్ చేసి తమ జట్టు శిబిరంలో కాస్త జోష్ నింపాడు. కానీ ప్రభ్-శ్రేయాస్ జోడీ తమదైన శైలిలో ఛేదన వైపు సాగింది. పవర్‌ప్లేలో జట్టు 61/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా ప్రభ్ ఎదురుదాడికి దిగి చకచకా బౌండరీలు రాబట్టి 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అటు జోరు పెంచిన శ్రేయాస్.. బుమ్రా ఓవర్‌లో రెండు ఫోర్లతో హ్యాట్రిక్ ఫిఫ్టీని అందుకున్నాడు. ఇక శార్దూల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదినా నమన్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. అప్పటికి మూడో వికెట్‌కు 139 పరుగుల భాగస్వామ్యం రాగా.. విజయానికి 27 బంతుల్లో 11 పరుగులే అవసరమయ్యాయి. దీంతో పంజాబ్ ఎలాంటి ఇబ్బందీ లేకుండా మరో 21 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్‌లో ఓపెనర్ డికాక్ మెరుపు ఆటతీరుతో అజేయంగా నిలిచాడు. అతడికి నమన్ ధిర్ మాత్రమే సహకారం అందించాడు. డెత్ ఓవర్లలో పంజాబ్ పేసర్లు ముంబైని కట్టడి చేశారు. పేసర్ అర్ష్‌దీప్ వరుస బంతుల్లో రికెల్టన్ (2), సూర్యకుమార్ (0)లను పెవిలియన్‌కు చేర్చాడు. ఈ స్థితిలో డికాక్‌తో కలిసి నమన్ ధిర్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. నమన్ పది పరుగుల వద్ద ఇచ్చిన సులువైన క్యాచ్‌ను చాహల్ వదిలేయడం కూడా కలిసివచ్చింది. ఆరో ఓవర్‌లో నమన్ 4,4,6తో చెలరేగడంతో పవర్‌ప్లేలో ఎంఐ 48 పరుగులు చేయలిగింది. అనంతరం డికాక్ జోరు పెంచి భారీ షాట్లతో చెలరేగాడు. దీంతో 28 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీ ప్రమాదకరంగా మారిన వేళ శశాంక్ తన తొలి ఓవర్‌లోనే నమన్‌ను అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 68 బంతుల్లో 122 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అటు డికాక్ మాత్రం తన ధాటిని కొనసాగిస్తూనే ఓ ఫోర్‌తో 53 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. కానీ షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడిన హార్దిక్ (14) నిరాశపర్చాడు. అతడి షాట్‌ను అందుకున్న శ్రేయాస్ బౌండరీ లైన్‌పై పడిపోవడానికి ముందే బంతిని గ్రౌండ్‌లోకి విసరడంతో అక్కడే ఉన్న బార్ట్‌లెట్ పట్టేశాడు. ఆ వెంటనే రెండు ఓవర్లలో రూథర్‌ఫోర్డ్ (1), తిలక్ (8) నిష్క్రమించడంతో ముంబై ఆఖరి నాలుగు ఓవర్లలో కేవలం 35 పరుగులే చేయగలిగింది. దీంతో జట్టు స్కోరు కూడా 200 లోపే ముగిసింది.





# స్టైలిష్ క్లైమాక్స్.. సిద్ధం చేసిన 'మన శంకరవరప్రసాద్ గారు'


# నిఖిల్ 'స్వయంభు' నుంచి 'రారా ధీవరా' సాంగ్ రిలీజ్

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న భారీ పీరియాడిక్ చిత్రం 'స్వయంభు'. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా తొలి పాటను విడుదల చేశారు. 'రారా ధీవరా' పేరుతో విడుదలైన ఈ సింగిల్, సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. బ్లాక్‌బస్టర్ మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ అందించిన సంగీతం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. భక్తి, పరాక్రమం కలగలిపిన థీమ్‌తో ఈ పాటను స్వరపరిచారు. రామజోగయ్య శాస్త్రి రాసిన సాహిత్యానికి, సంతోష్ వెంకీ తన గాత్రంతో ప్రాణం పోశారు. వైకుంఠ ఏకాదశి నేపథ్యంతో మొదలయ్యే ఈ గీతం, కథానాయకుడు ఒక యోధుడిగా పరివర్తన చెందే ఘట్టాన్ని పవర్‌ఫుల్‌గా ఆవిష్కరించింది. ఈ పాటను 500 మందికి పైగా డ్యాన్సర్లతో అత్యంత భారీ స్థాయిలో చిత్రీకరించారు. నిఖిల్, నభా నటేష్‌లపై చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ పాట విడుదల సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ, "'రారా ధీవరా' పాట నా పాత్రలోని స్ఫూర్తిని, దాని తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ పాట కోసం పడిన కష్టం, ఎమోషన్ చాలా ప్రత్యేకం" అని తెలిపారు. సంగీత దర్శకుడు రవి బస్రూర్ మాట్లాడుతూ, "పాత్రను, కథను ఉన్నత స్థాయిలో నిలబెట్టే పవర్‌ఫుల్ సౌండ్‌ను ఈ పాట ద్వారా తీసుకురావాలనుకున్నాం" అని వివరించారు.

భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నభా నటేష్, సంయుక్త హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్



పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగా, ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ పాట విడుదలైంది.




'పుష్ప'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా' సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఇటీవలే విడుదలైన ఫస్ట్‌లుక్‌తో సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసిన చిత్రబృందం ఇప్పుడు ఓ ఆసక్తికరమైన వార్తతో చర్చల్లో నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఓ కీలక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గతంలో షారుక్ ఖాన్‌తో అట్లీ తీసిన 'జవాన్' చిత్రం భారీ విజయం సాధించింది. వీరిద్దరి మధ్య ఉన్న మంచి అనుబంధం కారణంగానే 'రాకా'లో అతిథి పాత్రకు షారుక్ అంగీకరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రచారానికి ఇది మరింత బలం చేకూరుస్తోంది. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ సరికొత్త అవతారంలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఈ లుక్ కోసం ఆయన రోజూ 3 నుంచి 4 గంటల సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. ఇక హీరోయిన్ విషయంలోనూ పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రధానంగా దీపికా పదుకొణె పేరు బలంగా వినిపిస్తుండగా, రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ముంబైలో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా నటీనటుల పూర్తి వివరాలపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# 24 నుంచి ఓటీటీలోకి 'బ్యాండ్ మేళం'



కోర్ట్' సినిమాతో హిట్ పెయిర్ గా నిలిచారు హర్ష్ రోషన్ శ్రీదేవి. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన రెండో చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీశ్ జివ్వాజీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రచయిత కోన వెంకట్ నిర్మించారు. మార్చిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఓటీటీలో సందడి చేయడానికి సిద్ధమైంది. ఈనెల 24 నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని 'జీ 5' సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. కొత్త పోస్టర్ తో 'మీరు మెచ్చిన జంట మరోసారి దరువేయబోతోంది. మీరు సిద్ధమా?' అని క్యాప్షన్ పెట్టింది.

తెలంగాణలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బావా మరదళ్ళుగా ఒకే రోజున పుట్టిన జంట యాదగిరి (హర్ష్ రోషన్), రాజీ (శ్రీదేవి). చిన్నప్పటి నుంచి కలిసి మెలిసి పెరిగిన వీరిద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రాణం. పెద్దయ్యాక పెళ్లి కూడా చేసుకోవాలనుకుంటారు. కానీ గిరికి చదువు ఎక్కదు. ఓ మ్యూజిక్ బ్యాండ్ క్రియేట్ చేసి కాలం గడుపుతూ ఉంటాడు. రాజీ బాగా చదివి టెన్త్ క్లాస్ లో జిల్లాకే ఫస్ట్ వస్తుంది. పైచదువు కోసం రాజీ సిటీకి వెళ్ళడంతో ఇద్దరి మధ్య గ్యాప్ వస్తుంది. గిరి ఊళ్లోనే స్నేహితులతో బ్యాండ్ కొడుతూ ఓ మ్యూజిక్ సంస్థ నుంచి ఆల్బమ్ చేయమని ఆఫర్ రావడంతో నానా తిప్పలు పడి స్టూడియో పెడతాడు. అంతే కొబ్బరికాయ కొట్టిన రోజే స్టూడియో కాలిపోతుంది. అంతలోనే మరదలు రాజీకి పెళ్లి ఏర్పాటు చేస్తాడు తండ్రి సాయన్న (సాయికుమార్). పెళ్లి టైమ్ కి రాజీ మిస్ అవుతుంది. దాంతో ఆమె లేచిపోయిందనే టాక్ మొదలవుతుంది. అసలు రాజీ పారిపోవడానికి కారణం ఏంటి? గిరి, రాజీ కథ కంచికి చేరిందా? లేదా? గిరి కెరీర్ బాగుపడిందా? అన్నదే కథ.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**